సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



ఆధిక్యంలో కడప, నెల్లూరు జట్లు

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల కికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. కడప, నెల్లూరు జట్లు ఆధిక్యంలో కొనసాగుతున్నాయి. - 8లో

దసరా ప్రశాంతంగా ముగిసేలా ఏర్పాట్లు



దసరా నవరాత్రులు ప్రశాంతంగా ముగిసేలా ఏర్పాట్లు చేపట్టాలని ఎస్పీ కృష్ణారావు అధికారులను ఆదేశించారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.140
రెండోరకం	రూ.66	రూ.98

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 199 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

20న పాండిచ్చేరికి ప్రత్యేక బస్సు

మదనపల్లె సిటీ : దసరా సెలవులను పురస్కరించుకుని పాండిచ్చేరికి ఈ నెల 20న ప్రత్యేక బస్సు సర్వీసు నడపనున్నట్లు ఆర్టీసీ–2 డిపో మేనేజర్ ఆర్‌సీ నిరంజన్ తెలిపారు. 20న రాత్రి మదనపల్లెలో బయలుదేరి 21న పాండిచ్చేరికి చేరుకుంటుందన్నారు. రాక్‌బీచ్, వైట్‌సాండ్ బీచ్, లైట్ హౌస్, అరబిందో ఆశ్రమం, బాసిలిక చర్చి, షాపింగ్ చూసుకుని మరుసటి రోజు 22న వండలూరు జూ పార్కు చూసుకుని సాయంత్రం కంచిలో టెంపుల్, షాపింగ్ చూసుకుని రాత్రి బయలుదేరి 23న ఉదయం మదనపల్లెకు చేరుకుంటుందన్నారు. చార్జీ రూ.2000 చెల్లించాలన్నారు. వివరాలకు 9959225677, 9160186645 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అరక్కోణం ప్యాసింజరు రైలు రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప–అరక్కోణం–కడప మధ్య నడుస్తున్న ప్యాసింజర్ రైలును ఈనెల 16నుంచి 22 వరకు రద్దు చేసినట్లు కడప సీనియర్ రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనార్దన్ తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక



పోటీలను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

రాజంపేట టౌన్ : ఉమ్మడి తూర్పు గోదావరిజిల్లాలో ఈనెల 14వ తేదీ నుంచి రెండు రోజుల పాటు అండర్–23, సీనియర్స్ విభాగంలో 10వ రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ ఫెన్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఉమ్మడి వైఎస్సార్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరచిన వారిని ఇంటర్‌డిస్ట్రిక్ట్ పోటీలకు ఎంపిక చేశారు. అండర్–23 పురుషుల విభాగంలో కె.జోషిత్‌రెడ్డి, మహిళల విభాగంలో గ్రేసి, సీనియర్స్ విభాగం మహిళల విభాగంలో డీ.గ్రేసి, పురుషుల విభాగంలో వీ.చంద్రఓబులేష్, సాయిసుదర్శన్, కిషోర్‌లు ఎంపికయ్యారు. తొలుత ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జ్ ప్రిన్సిపాల్ బీ.చంద్రమోహన్ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఏ.రామాంజనేయులు, పీడీ మురళీకృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి సుధాకర్ పాల్గొన్నారు.

27న జానపద నృత్య పోటీలు

రాయచోటిటౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా స్థాయి జానపద నృత్య, రోల్ ప్లే పోటీలు ఈనెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు డైట్ కళాశాల ప్రిన్సిపల్ రాఘవరెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ వారి ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8,9వ తరగతి చదివే వారు జానపద నృత్యాలు, రోల్ ప్లే (పాత్ర పోషణ) మాత్రం 9వ తరగతి చదివే విద్యార్థులు మాత్రమే పాల్గొనాలన్నారు. ఈ పోటీలు అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటిలోని డైట్ సెంటర్‌లో నిర్వహిస్తామన్నారు. ఇందులో ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రభుత్వ జిల్లా పరిషత్, ఆదర్శ, ఎయిడెడ్, గురుకుల, కేజీబీవీలో చదివే విద్యార్థులు మాత్రమే పాల్గొనాలని సూచించారు. మరిన్ని వివరాలకు డైట్ అధ్యాపకులు అజయ్‌కుమార్ 9347541312, శ్రీదేవి 9441228359, అసదుల్లా 9440084715 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

నేడు మదనపల్లెలో కేంద్ర బృందం పర్యటన

మదనపల్లె : వన్ డిస్ట్రిక్ట్– వన్ ప్రొడక్ట్(ఒడిఓపీ) కార్యక్రమంలో అవార్డు కోసం అన్నమయ్య జిల్లాకు సంబంధించి మదనపల్లె పట్టుచీరను కేంద్రప్రభుత్వానికి రాష్ట్ర చేనేత జౌళిశాఖ దరఖాస్తు చేసిన నేపథ్యంలో పరిశీలనలో భాగంగా శుక్రవారం మదనపల్లెలో కేంద్రబృందం పర్యటించనుంది. జిల్లా చేనేత, జౌళిశాఖ గురువారం విడుదల చేసిన ప్రకటనలో... కేంద్రప్రభుత్వానికి చెందిన ఇన్వెస్ట్ ఇండియా బృందసభ్యులు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కొత్తవారిపల్లె వద్ద మల్బరీతోటను పరిశీలిస్తారని చెప్పారు. మధ్యాహ్నం 11.30 గంటలకు మదనపల్లె బైపాస్‌రోడ్డులోని సిల్క్‌రీలింగ్, ట్విస్టింగ్ యూనిట్లను, 12.00 గంటలకు నీరుగట్టువారిపల్లెలో సిల్క్‌యార్న్ డైయింగ్ యూనిట్‌ను పరిశీలిస్తారన్నారు. తర్వాత 12.30 నుంచి కోళ్లబైలు వీవర్స్‌కాలనీలో కోళ్లబైలు హ్యాండ్‌లూమ్ క్లస్టర్‌లోని చేనేత కార్మికులతో సమావేశమై.. చీరల తయారీలో వారు వినియోగిస్తున్న ఆధునిక నైపుణ్యాలు, మెలకువలను తెలుసుకుంటారన్నారు. 2.30 గంటలకు హనుమాన్, కావేరి సిల్క్స్ దుకాణాల్లో ఉత్పత్తులను పరిశీలిస్తారు. సాయంత్రం 5 గంటలకు రాయచోటికి చేరుకుని జిల్లా కలెక్టర్ గిరీషా, చేనేత జౌళిశాఖ అధికారులతో సమావేశమై డాక్యుమెంట్లు పరిశీలిస్తారన్నారు.

క్రీడా సంరంభం

- గల్లీ నుంచి రాష్ట్ర స్థాయి దాకా ఆటల పోటీలు
- డిసెంబర్ 11 నుంచి జనవరి 15 వరకు క్రీడా పోటీలు
- సచివాలయాలకు చేరిన క్రీడా సామగ్రి

రాయచోటి : నెల రోజుల్లో ఆటల సంబరం ఆరంభం కానుంది. పల్లె ప్రాంతాల్లో ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో క్రీడా పోటీలు నిర్వహించేందుకు సమాయత్తమైంది. ఇందుకు అవసరమైన క్రీడా పరికరాలను ఆయా ప్రాంతాల సచివాలయాలకు చేర్చింది. క్రీడల నిర్వహణకు అనువైన ప్రాంతాలను ప్రాంగణాలను కూడా సిద్ధం చేసింది.

ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమాన్ని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలో నవంబర్ నెల రెండో వారం నుంచి పోటీలను ప్రారంభించనుంది. అన్నమయ్య జిల్లాలో మాత్రం డిసెంబర్ రెండో వారంలో ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా 501 గ్రామ వార్డు సచివాలయాల పరిధిలో ఆటల పోటలు నిర్వహించనున్నారు. దేశచరిత్రలో ఇప్పటిదాకా ఏ రాష్ట్రంలో చేపట్టని విధంగా కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా మూడు లక్షల పోటీలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లా పరిధిలో 10 వేల నుంచి 20 పోటీలను నిర్వహించేలా ప్రణాళికలను సిద్ధం చేశారు. ఆడుదాం ఆంధ్రాలో క్రికెట్, బ్యాడ్మింటన్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించనున్నారు. వీటికి అదనంగా 3కె మారథాన్, యోగా, టెన్నికాయిట్ ఈవెంట్లను కూడా జరుపుతారు.

విజేతలకు నగదు బహుమతులు

క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడల్లో నియోజక వర్గ స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.35 వేలు, రూ.15 వేలు, రూ.5 వేలు చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతులను



జిల్లాకు చేరిన క్రీడా సామగ్రిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే తదితరులు(ఫైల్)

అందించనున్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ.30 వేలు, రూ.10 వేలు అందిస్తారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు రూ.5 లక్షలు, రూ.3 లక్షలు, రూ.2 లక్షల వంతున ప్రభుత్వం అందజేయనుంది.

బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రముఖ క్రీడాకారులు

పోటీలకు బ్రాండ్ అంబాసిడర్లుగా ప్రముఖుల పేర్లను ప్రకటించి వారిని ఇందులో భాగస్వామ్యం చేయనున్నారు. మారుమూల ప్రాంతాల్లో క్రీడాకారులను గుర్తించడానికి ఈ క్రీడా సంబరాలు దోహదపడతాయన్నది ప్రభుత్వ ఉద్దేశం. పోటీలకు వచ్చే క్రీడాకారులకు మంచి భోజనంతో సహా ఇతర సదుపాయాలు కల్పించనున్నారు.

క్రీడా మైదానాలు సిద్ధం

ఆడుదాం ఆంధ్రాక్రీడా పోటీలకు అవసరమైన క్రీడా మైదానాలను కూడా అధికారులు సిద్ధం చేశారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడా పరికరాలను జిల్లా కేంద్రం నుంచి సచివాలయాలకు పంపించే ఏర్పాట్లు పూర్తయ్యాయి. వీటికి సంబంధించిన శాంపిల్స్‌ను రెండు రోజుల కిందట జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, స్థానిక ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు పరిశీలించారు. జిల్లా కేంద్రానికి ఇప్పటికే ఈ పరికరాలు చేరుకున్నాయి. మరి కొద్ది రోజుల్లో వీటిని ఆయా సచివాలయాలకు అందజేసి క్రీడలకు శిక్షణ ఇచ్చే అవకాశాలు ఉన్నాయి.

జిల్లాకు కేటాయించిన క్రీడా పరికరాల వివరాలు	
బేసిక్ క్రికెట్ కిట్ మెన్	1002
బేసిక్ క్రికెట్ కిట్ ఉమెన్స్	501
ప్రొఫెషనల్ క్రికెట్ కిట్ మెన్	60
ప్రొఫెషనల్ క్రికెట్ కిట్ ఉమెన్	30
క్రికెట్ లెదర్ బాల్స్	72
బ్యాడ్మింటన్ నైలాన్ నెట్	501
స్టేజ్–1 బ్యాడ్మింటన్‌రాకెట్స్	3006
స్టేజ్–2 బ్యాడ్మింటన్ రాకెట్స్	240
నైలాన్ షటిల్ కాక్	501
నైలాన్ షటిల్ కాక్	1002
ఫెదర్ షటిల్ కాక్	360
స్టేజ్–1 వాలీబాల్	1503
స్టేజ్–2 వాలీబాల్	120
వాలీబాల్ నెట్	నిల్
కబడ్డీ నీ క్యాప్స్	925
కోకో యాంక్లెట్స్	925
టెన్నికాయిట్	నిల్
ట్రోఫీలు	210
మెడల్స్	2394
సర్టిఫికెట్స్	2394

ప్రత్యేక కార్యాచరణతో పోటీలు



ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడా పోటీల న్విహణకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశాం. జిల్లాలో డిసెంబర్ 11వ తేదీ నుంచి వచ్చే సంవత్సరం జనవరి 15వ తేదీ వరకు పోటీలు జరగనున్నాయి. ఇందు కోసం గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పాఠశాలల ప్రాంగణాల పరిశీలన పూర్తి చేశాం. కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరి సహకారంతో ముందుకెళుతున్నాం.

– చంద్రశేఖర్, చీఫ్ కోచ్, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ

పేదల సొంతింటి కల
నెరవేర్చిన సీఎం జగన్

జిల్లా కలెక్టర్ గిరిషా పీఎస్, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి : రాష్ట్రంలో మహిళలు గర్వపడేలా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిదేనని అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 7.43 లక్షల ఇళ్ల ప్రారంభోత్సవం సందర్భంగా కలికిరి వైఎస్‌ఆర్ జగనన్న కాలనీలో(సీఎల్‌ఆర్‌సీ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవరత్నాలు–పేదలందరికీ ఇల్లు కార్యక్రమంలో భాగంగా మహిళలకు రూ.10లక్షల నుంచి 20 లక్షల వరకు ఆస్తిని సమకూర్చి, సమాజంలో మహిళల సొంతింటి కలను నెరవేర్చి.. వారు గర్వపడి జీవించేలా చేసిన ఘనత ముఖ్యమంత్రికి దక్కిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా హౌసింగ్ నిర్మాణాల పురోగతిలో అన్నమయ్య జిల్లా నాలుగో స్థానంలో ఉందని, పేదలందరికీ ఇళ్లు పథకంలో జాతీయ స్థాయిలో రాష్ట్రం రెండో స్థానంలో ఉన్నట్లు తెలిపారు. ఇంకా అర్హత ఉండి సొంతిల్లు లేని వారు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కాలనీల్లో రోడ్లు, తాగునీటి కుళాయిలు, విద్యుత్, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అలాగే అన్ని రకాల సంక్షేమ పథకాలు ఇంటి వద్దకే అందుతున్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైఎస్‌ఆర్ జగనన్న కాలనీ(సీఎల్‌ఆర్‌సీ) ప్రారంభోత్సవ శిలాఫలకం ఆవిష్కరించారు. కాలనీలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఇళ్లను ప్రారంభించి, ప్రభుత్వం తరపున లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందచేసి అభినందనలు తెలిపారు. మొక్కలు నాటారు. విద్యుత్, తాగునీటి సౌకర్యాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ భాస్కర్‌నాయుడు, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, హౌసింగ్ పీడీ సాంబశివయ్య, డీఆర్‌డీఏ పీడీ తులసీ, డీఈ గోపాల్‌నాయక్, పీఆర్ డీఈ భాస్కర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, ఎంపీడీఓ గంగయ్య, తహసీల్దారు భాగ్యలత, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

రబీ సాగుకు రాయితీ విత్తనాలు పంపిణీ

రాయచోటి : 2023–24 రబీ సీజన్ సన్నద్ధతలో భాగంగా జిల్లాలో 11వేల క్వింటాళ్ల ఉలవ రాయితీ విత్తనాలను రైతులకు పంపిణీ చేసినట్లు జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. గురువారం వ్యవసాయం, పశుసంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్, రెవెన్యూ, రీసర్వే, జాతీయ రహదారులకు భూసేకరణ, ఎంపీఎఫ్‌సీ గోడౌన్‌లకు భూ కేటాయింపు, ప్రాధాన్యత భవనాలు, ఉపాధి హామీలో వెజ్ జనరేషన్, జల్ జీవన్ మిషన్, జగనన్నకు చెబుదాం తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రాయితీ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయన్నారు. అయితే వర్షాభావం కారణంగా రైతులు పూర్తిగా సాగుచేయడం లేదన్నారు. గ్రామాల్లో విరివిగా ఉపాధి హామీ పనులు కల్పించాలని డ్వామా అధికారులను ఆదేశించినట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డికి తెలియజేశారు.

17 రోజుల్లోనే వైఎస్సార్ బీమా



బాధిత మహిళతో మాట్లాడుతున ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

కురబలకోట : వైఎస్సార్ బీమా లబ్ధిదారుల పాలిట ధీమాగా నిలుస్తోంది. కురబలకోట మండలంలోని అంగళ్లు గ్రామం మొలకవారిపల్లెలో గత నెల ఒకటిన ఆటో డ్రైవర్ షేక్ అరీఫుల్లా ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. ఇతనికి భార్య ఆస్మా, ఇద్దరు కుమార్తెలు. తక్షణ ఉపశమనం కింద అప్పటికప్పుడే రూ.10 వేలు అధికారులు అందజేశారు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందడంతో కుటుంబీకులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. అయితే ఇతనికి వైఎస్సార్ బీమా ఉంది. నామినీ కింద ఇతని భార్య పేరు ఉంది. బీమా సొమ్ముకు అవసరమైన డాక్యుమెంట్లను గత నెల 22న బాధితురాలు సమర్పించింది. అదే రోజు ఆన్‌లైన్‌లో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈనెల 9న రూ.5 లక్షల బీమా సొమ్ము లబ్ధిదారు ఖాతాకు నేరుగా జమ అయింది. గత టీడీపీ ప్రభుత్వంలో ఆరు నెలల నుంచి పది నెలలు కూడా పట్టేది. ఇలాంటిది జగనన్న ప్రభుత్వంలో రోజుల వ్యవధిలోనే అనగా 17 రోజుల్లోనే ఈ బీమా సొమ్ము బాధితురాలి ఖాతాలో పడటం విస్మయాన్ని కల్గించింది. ఇటీవల ఆమె వేరే పనిపై బ్యాంకుకు వెళ్లగా రూ.5 లక్షలు బ్యాంకు ఖాతాల్లో ఉన్నట్లు బ్యాంకు అధికారులు చెప్పడంతో ఆమె ఆశ్చర్యపోయింది. వెంటనే సచివాలయ అధికారులకు తెలియజేసింది. బీమా సొమ్ము పడినట్లు వారు గుర్తించారు. ఇంత తక్కువ వ్యవధిలోనే వైఎస్సార్ బీమా సొమ్ము రావడం రాష్ట్ర స్థాయిలో ఇదే ప్రథమమని మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. గురువారం ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అంగళ్లులో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష సభలో ఆమెకు బీమా సొమ్ము మంజూరు పత్రం అందజేశారు. ఆమె దయనీయ పరిస్థితి గమనించిన ఎమ్మెల్యే ఇద్దరు ఆడపిల్లలకు రూ.లక్ష చొప్పున రూ.2 లక్షలు సాయంగా బ్యాంకులో డిపాజిట్ చేస్తున్నట్లు సభలో ప్రకటించారు. ఈ సందర్భంగా ఆస్మా మాట్లాడుతూ 17 రోజుల్లోనే బీమా సొమ్ము రావడం ఆపదలో ఉన్న మాలాంటి వారికి ఇది ఊరటన్నారు. తన ఇద్దరు బిడ్డలకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి లక్ష చొప్పున బ్యాంకులో డిపాజిట్ చేస్తామని చెప్పడం పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

పీలేరు : విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీరామ్ పురుషోత్తం అన్నారు. గురువారం పీలేరు మండలంలోని ఎనుమలవారిపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకుని ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలన్నారు. విద్యార్థులతో ఇంగ్లీషు, హిందీలో భాషా పరిజ్ఞానంపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. మధ్యాహ్నం భోజనం తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థులకు ఇంగ్లీషులో కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించాలన్నారు. అలాగే ఇంట్రాక్టివ్ ప్యానెల్ బోర్డులు ఉపయోగించి నూతన సాంకేతికతను జోడించి బోధించాలన్నారు. విద్యార్థులకు రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు ఇవ్వాలని సూచించారు. ప్రతి వారం విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ విద్యార్థులకు ఉపయోగపడే విధంగా మేసెజ్ లింక్‌ను జిల్లాలోని అన్ని పాఠశాలలకు పంపుతామని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, హెచ్‌ఎంలు వేణుగోపాల్ రెడ్డి, బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో శ్రీరామ్‌పురుషోత్తం

చింతయూనిట్‌తో నిశ్చింత

- చింత పండు ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభానికి సిద్ధం
- దేశంలోనే రెండోది
- మహిళలకు ఉపాధే లక్ష్యం

కురబలకోట : చింత చెట్టు లేని ఊరు..చింతపండు లేని ఇళ్లు అరుదు. మంత్రాలకు చింతకాయలు రాలుతాయో లేదో కాని డబ్బులు మాత్రం రాలుతున్నాయి. దీని ప్రాధాన్యత, ప్రాముఖ్యతను గుర్తించి కురబలకోట మండలంలోని చెన్నామర్రి మిట్ట వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సౌజన్యంతో ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ (కెవీఐసీ) కింద రూ. 5 కోట్ల వ్యయంతో చింత పండు ప్రాసెసింగ్ యూనిట్ నిర్మించారు. సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వం ఎకరా 20 సెంట్ల స్థలాన్ని ఇందుకు కేటాయించింది. దీని మంజూరు వెనుక ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి కృషి ఎంతో ఉంది. దేశంలో చత్తీస్‌గడ్‌లో ఇలాంటి యూనిట్ ఉంది. ఆతర్వాత దేశంలో ఇదేనని అధికారులు వెల్లడిస్తున్నారు. రాష్ట్రంలోనే కాకుండా సౌత్ ఇండియాలోనే ఇది మొదటి యూనిట్‌గా చెబుతున్నారు. మిషన్లు కూడా అమర్చారు. త్వరలో ప్రారంభించనున్నారు. దీని వల్ల యూనిట్‌లో వంద మందికి ఉపాధి లభించనుంది. అంతేగాకుండా చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లోని మూడు వేల మంది డ్వాక్రా సభ్యులకు ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కల్పించాలన్నది లక్ష్యం. చిత్తూరు జిల్లాలో పెద్దపంజాణి, చౌడేపల్లె, పుంగనూరు, అన్నమయ్య జిల్లాలో కురబలకోట, రామసముద్రం మండలాలు ఈ యూనిట్ పరిధిలోకి వస్తాయి. చిత్తూరు చింతపండు క్లస్టర్ పేరుతో దీన్ని నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. చింత పండు ఆధారిత ఉత్పత్తులు ఇక్కడ తయారు చేసి మండల సమాఖ్య ఆధ్వర్యంలో స్ఫూర్తి పేరుతో మార్కెటింగ్ నిర్వహించనున్నారు. టీటీడీ, మాల్స్, సూపర్ మార్కెట్లు, హోటళ్లు, ఫ్రాంచైజింగ్ యూనిట్లు తదితర వాటికి ఇక్కడ తయారు చేసిన చింతపండు ఉత్పత్తులను సరఫరా చేయనున్నారు.



కురబలకోట చెన్నామర్రి మిట్ట వద్ద ఉన్న చింతపండు ప్రాసెసింగ్ యూనిట్

మైసూరు సాంకేతిక సహకారం

మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్‌ఐ(సెంట్రల్ ఫుడ్ టెక్నలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్) ఈ యూనిట్‌కు క్వాలిటీ కంట్రోల్, సాంకేతిక సహకారం అందించనుంది. ఇక్కడ రోజుకు ఐదు వేల కేజీల చింతపండు ప్రాసెసింగ్ చేయాలన్నది సంకల్పం. చింతపండు నుంచిగుజ్జు (ఫల్ప్),పౌడర్, చాక్లెట్స్ (కాండీ), సూప్, సాస్ లాంటివి తయారు చేస్తారు. ఈ యూనిట్‌కు అనుబంధంగా వర్కింగ్ షెడ్, కలెక్షన్ సెంటర్, కోల్డ్ స్టోరేజీని నిర్మించాలన్నది కూడా పరిశీలనలో ఉంది. మహిళా సభ్యులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు ఇదివరకే నిర్వహించారు. ఈ యూనిట్ రాష్ట్రానికే పైలెజ్ ప్రాజెక్టుగానే కాకుండా తలమానికంగా నిలవనుంది.

పట్టాలు తప్పిన రైల్వే జంక్షన్లు!

- పేరుకే పెద్ద.. వసతుల్లో చిన్న
- ఎర్రగుంట్ల, కడప, ఓబులవారిపల్లెలో ఆగని కొన్ని రైళ్లు
- ఇతర ప్రాంతాల జంక్షన్లతో పోలికేలేని వైనం

రైలుమార్గం	ముంబయి-చెన్నై
మార్గాలు	2
జంక్షన్లు	3

రాజంపేట : రైల్వే జంక్షన్లు అభివృద్ధిలో పట్టాలు తప్పాయి. హోదా ఘనం.. ప్రగతిలో హీనంగా మారాయి. సాదాసీదా స్టేషన్లుగానే మిగిలిపోయాయి. ముంబయి–చెన్నై రైల్వే మార్గంలోని గుత్తి–రేణిగుంట మధ్య మూడింటిని జంక్షన్ల స్టేషన్లుగా గుర్తించారు. కడప, ఎర్రగుంట్ల, ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్లను దక్షిణ మధ్య రైల్వే ఇటీవల జంక్షన్లుగా ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే పేరుకు మాత్రమే జంక్షన్‌స్టేషన్లుగా నిలిచిపోయాయి. కేవలం ప్రకటనతో మమా అనిపించారు. ఇతర ప్రాంతాల వాటితో అభివృద్ధితో పోలికే లేకుండా పోయింది. కొన్ని రైళ్లు కూడా ఆగడం లేదు.

రైలు మార్గాల అనుసంధానతతో..

రైల్వేబడ్జెట్ మేరకు 1996–1997లో ప్రారంభమైన ఎర్రగుంట్ల–నంద్యాల రైలుమార్గంతో ఎర్రగుంట్లను జంక్షన్‌గా గుర్తించారు. 2008–2009లో కడప –బెంగళూరు రైలుమార్గం ఏర్పాటైంది. ఈ మార్గంతో కడప రైల్వేస్టేషన్ జంక్షన్‌గా ఏర్పడింది. 2005–2006లో కృష్ణపట్నం–ఓబులవారిపల్లె రైలు మార్గం ఏర్పాటైంది. ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్.. కృష్ణపట్నం రైలుమార్గానికి అనుసంధానత (కనెక్టివిటి) స్టేషన్ కావడంతో జంక్షన్‌గా గుర్తించారు.

అటకెక్కిన కడప రీడెవలప్‌మెంట్

ఎయిర్‌పోర్టును తలిపించేలా రైల్వేస్టేషన్లను రీడెవలప్‌మెంట్ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా కడప రైల్వే స్టేషన్‌ను రీడెవలప్‌మెంట్ చేసేందుకు గతంలో రైల్వేశాఖ నిర్ణయించింది. ఆ తర్వాత అటకెక్కించింది. ఏ కేటగిరిలో కడప రైల్వేస్టేషన్ ఉంది. విశాలమైన ప్లాట్‌ఫాంలను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆధునిక సౌకర్యాల లేమి కనిపిస్తోంది. రీడెవలప్‌మెంట్ వెనక్కి వెళ్లిపోయిందనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు కడప–బెంగళూరు రైలు మార్గ అనుసంధానంతో జంక్షన్‌గా ఉన్నప్పటికీ.. ఆ స్థాయిలో అభివృద్ధి కనిపించడం లేదు.

కాలుష్యకోరల నుంచి విముక్తేదీ?

ఎర్రగుంట్ల రైల్వే జంక్షన్‌ను కాలుష్య కోరల్లో నుంచి విముక్తి కల్పించే దిశగా రైల్వే శాఖ ఎటువంటి ప్రయత్నాలు చేయలేదు. పైగా ఇప్పుడు లోకోరన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్ ఏర్పాటు చేశారు. దాని నిర్వహణ కూడా విఫలమైందని రన్నింగ్‌స్టాఫ్ వర్గాలే పెదవి విరుస్తున్నాయి. డివిజన్ అధికారుల అనాలోచిత నిర్ణయాల వల్ల అనవసర వ్యయంతో రైల్వేకి భారీగా నష్టం కలిగించారు. ఈ స్టేషన్‌ను అభివృద్ధి చేసే పరిస్థితులు కనుచూపు మేరలో కనిపించడం లేదు. స్థల లేమి సమస్య ఓ వైపు పీడిస్తోంది.

గ్రామీణస్టేషన్‌గానే ఓబులవారిపల్లె

ఓబులవారిపల్లె జంక్షన్ నేటికీ గ్రామీణ రైల్వేస్టేషన్‌గానే కొనసాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లకు హాల్టింగ్స్ లేవు. పైగా స్టేషన్ ఔటరు నుంచి విజయవాడ డివిజన్ పరిధిలోకి వెళ్లిపోయింది. కేవలం స్టేషన్ మాత్రమే గుంతకల్ డివిజన్‌లో ఉంది. జంక్షన్ కాగానే స్టేషన్ రూపురేఖలు మారిపోతాయని ఇక్కడి ప్రాంతీయులు భావించారు. అయితే కలగానే మిగిలిపోయింది.



గ్రామీణ రైల్వేస్టేషన్‌లా కనిపిస్తున్న ఓబులవారిపల్లె

అభివృద్ధి చేయాలి



ఓబులవారిపల్లె రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాల్సిన అవశ్యకత ఎంతైనా ఉంది. ఆ దిశగా రైల్వేబోర్డు యోచించాలి. ఈ విషయాన్ని ఎంపీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తాను. అన్ని రైళ్లకు హాల్టింగ్ కల్పించాలని కోరుతాను. ఇప్పటికీ ఎంపీ రైల్వే సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నారు.

–కొరముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యే, రైల్వేకోడూరు

కేంద్రం దృష్టి సారించాలి



కడప రైల్వేస్టేషన్ అభివృద్ధిపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలి. అధునాతన సౌకర్యాలు కల్పించాలి. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కడప రైల్వేల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఇప్పటికే పలు మార్లు రైల్వే శాఖ మంత్రి, అధికారులను కలిశారు. పేరుకే జంక్షన్‌లా ఉంది. ఎయిర్‌పోర్టులా తీర్చిదిద్దాలి.

–బీహెచ్ ఇలియాస్, డైరెక్టర్, ఏపీఎన్‌ఆర్టీఎస్, కడప

క్లుప్తంగా

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె : ద్విచక్రవాహనం ఢీకొని ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం మదనపల్లె మండలంలో జరిగింది. పట్టణ శివారు ప్రాంతంలోని వెంగమాంబసర్కిల్ బీఎస్ రెడ్డి కాలనీకి చెందిన జాకీర్(42) ద్విచక్రవాహనంలో వస్తుండగా, వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదంలో అదుపుతప్పి కిందపడటంతో జాకీర్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితుడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

14 మద్యం బాటిళ్లు స్వాధీనం

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె పంచాయతీ బీసీ కాలనీ వద్ద అక్రమంగా తీసుకెళ్తున్న 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఓ మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు. రాచపల్లి పంచాయితీ గంగనేరు క్వార్టర్స్‌కు చెందిన పుష్పగిరి రమాదేవి మండల కేంద్రం నుంచి రాచపల్లికి 14 మద్యం బాటిళ్లను తీసుకెళ్తుండగా ముందస్తు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు బీసీ కాలనీ పరిధిలోని గంగనేరు క్రాస్ వద్దకు రాగానే తమ సిబ్బంది తనిఖీ చేసి 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. నిందితురాలిని అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.

లారీని అటకాయించి నగదు, సెల్‌ఫోన్ల అపహరణ

మదనపల్లె : లారీని అటకాయించి అందులోని డ్రైవర్, క్లీనర్ వద్ద ఉన్న నగదు, సెల్‌ఫోన్లు అపహరించిన సంఘటన బుధవారం రాత్రి మదనపల్లె మండలంలో జరిగింది. కర్నాటక రాయల్పాడు గుట్టమీదవారిపల్లెకు చెందిన చలపతి(37) లారీ డ్రైవర్ కాగా, అదే గ్రామానికి చెందిన శ్రీనివాసులు(37) అతడివద్ద క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. వీరిద్దరూ కలిసి బుధవారం టమాటా లోడ్‌తో మదనపల్లె మార్కెట్‌కు వచ్చి కాయలు అన్‌లోడ్ చేశారు. తిరిగి రాత్రి రాయల్పాడుకు వెళుతుండగా, మదనపల్లె మండలం చిప్పిలి సమీపంలో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు లారీని అటకాయించారు. డ్రైవర్, క్లీనర్‌ను లారీ నుంచి కిందకు దింపి బెదిరించి వారి వద్ద ఉన్న రూ.3,000 నగదు, మూడు సెల్‌ఫోన్‌లను తీసుకెళ్లారు. వారిపై దాడి చేశారు. దాడిలో గాయపడిన బాధితులు ఇద్దరూ మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని చికిత్స పొందారు. అనంతరం తాలూకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దసరా నవరాత్రులు
ప్రశాంతంగా ముగిసేలా ఏర్పాట్లు

జిల్లా నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ బి.కృష్ణారావు



రాయచోటి : దసరా నవరాత్రుల సందర్భంగా జిల్లాలో ముందస్తు పోలీసు చర్యలను చేపట్టి ప్రశాంతంగా నిర్వహించేలా చూడాలని జిల్లా పోలీసు యంత్రాంగానికి ఎస్పీ బి. కృష్ణారావు ఆదేశించారు. గురువారం అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ జిల్లా శాంతి భద్రతలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులలో లోతైన విచారణ చేపట్టి కోర్టు ద్వారా షీట్స్‌లోని నిందితులకు తగిన శిక్షపడేలా కృషి చేయాలన్నారు. జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టి కట్టడి చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను ఆదేశించారు. దసరా నవరాత్రులు నేపథ్యంలో జిల్లాలోని ప్రముఖ దేవాలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. తీవ్ర నేరాలకు పాల్పడిన వారిపై నిరంతరం నిఘా ఉంచి బైండోవర్ చేయాలని సూచించారు. కేసు నమోదు నుంచి చార్జిషీటు వరకు ప్రతి విషయాన్ని కూలంకశంగా పరిశోధన చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా పోలీసు యంత్రాంగానికి ఎస్పీ సూచించారు. వాహన తనిఖీలు చేపట్టి చలానాలు విధిస్తూ వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు పాటించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్‌పై దృష్టి సారించాలని, రాత్రి వేళల్లో గస్తీ పెంచి దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ముఖ్యంగా చోరీసొత్తు రికవరీ పెంచాలన్నారు.

శాంతి భద్రతలపై..

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తూ, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిని, ఎక్కువ కేసుల్లో ఉన్న వారిపై పీడీ చట్టం ప్రకారం చర్యలు తీసుకునేలా ప్రతిపాదనలు పంపాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ డాక్టర్ బీవీ రాజ్ కమల్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగ క్రీడా ఎంపికలు




అండర్-14, అండర్-17 బాలికల జట్టు, అండర్-14, అండర్-17 బాలుర జట్టు

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం వేదికగా నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి యోగ క్రీడా ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపికచేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. అనంతరం యోగ శిక్షకులు డాక్టర్ ఆర్.రంగనాథ రెడ్డి, పెంచలయ్య తదితరులు యోగ ఆసనాల గురించి వివరించారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి దాదాపు 350 మంది క్రీడాకారులు యోగ ఎంపికలకు హాజరయ్యారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నిత్యప్రభాకర్, మహబూబ్‌బాషా, ప్రవీణ్‌కిరణ్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..

యోగ అండర్-14 బాలికలు : ఎస్. సన్ని, కె.మనస్వి, ఎస్. సన్నీ, కె. హేమ, ఎన్.సమీర, కె.ఎల్.అస్మిత, ఎ.లక్ష్మిప్రియ. స్టాండ్‌బై: ఎస్.అస్మిత, ఎస్.భవిత, ఎల్.చందన.

యోగ అండర్-14 బాలురు : పి.భరత్, బి. శివకేశవ, ఎస్.సాయిధనుంజయ, కె.సాత్విక్, ఎం.నాగేంద్ర, జి. విజయసుందర్‌రెడ్డి. స్టాండ్‌బై : జి.జయకేశవ, వై.అరుణ్‌కుమార్, ఎస్.అర్షద్, బి.సుకాంత్.

యోగ అండర్-17 బాలికలు : సి.ప్రవల్లిక, ఎస్.శివజ్యోతిరెడ్డి, టి.శ్రీవిద్య, పి.మేఘన, ఎం.నాగవైష్ణవి, జి.శిరీష, ఎం.లాస్య, స్టాండ్‌బై : ఎస్.అమూల్య, వి.దేవి, టి.గాయత్రి, కె.నందిని, బి.అనూరాధ.

యోగ అండర్-17 బాలురు : ఎం.సాయికుమార్‌నాయక్, టి.నర్సింహరేవంత్, ఎం.జగదీష్, ఎన్.రేవంత్‌కుమార్, ఆర్.వెంకటేష్, ఎస్.ముజీబ్, జి.వెంకటకృష్ణ, స్టాండ్‌బై: వై.భరత్, జె.జశ్వంత్, వెంకటవినయ్‌కుమార్, పి.రత్నాకర్.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న సాయినాథ్

మదనపల్లె : తనను పట్టించుకునే వారు ఎవరూ లేరని యువకుడు మనస్తాపంతో ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం రాత్రి పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లెకు చెందిన పరశురామ్ కుమారుడు సాయినాథ్(20) తండ్రితో కలిసి స్థానికంగా గది అద్దెకు తీసుకుని నివసిస్తున్నాడు. తండ్రి చేనేత కార్మికుడు కాగా.. సాయినాథ్ కదిరిరోడ్డులో ఉన్న జోయాస్ హోటల్‌లో పనిచేస్తూ జీవిస్తున్నాడు. మూడేళ్ల వయస్సులోనే ఇతడి తల్లి పద్మావతి అనారోగ్యంతో మృతి చెందింది. ఇద్దరు అక్కలు తిరుపతిలో స్థిరపడ్డారు. అయితే కొంతకాలం క్రితం తండ్రి ఇతడిని వదిలి వెళ్లిపోయాడు. దీంతో ఒంటరిజీవితాన్ని గడుపుతున్న సాయినాథ్ మానసికంగా బాధపడుతూ, మనస్తాపంతో అద్దెకు ఉంటున్న గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. గురువారం ఉదయం గమనించిన స్థానికులు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకు దించి స్థానికులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఆటో-కారు ఢీ

– ఏడుగురు మహిళా కూలీలకు గాయాలు



ప్రమాదంలో గాయపడిన మహిళా కూలీలు

కలకడ : ఆటో-కారు ఢీకొన్న సంఘటనలో ఏడుగురు మహిళా కూలీలకు గాయాలైనట్లు ఎస్ఐ సిటిస్వామి తెలిపారు. ఆయన కథనంమేరకు.. గురువారం మండలంలోని కె.బాటవారిపల్లె పంచాయతీ కొత్తగాండ్లపల్లెకు చెందిన దేరంగుల శివప్రసాద్ తన ఆటోలో కె.బాటవారిపల్లె బీసీ కాలనీకి చెందిన సరోజమ్మ, ఆదిలక్ష్మి, రాజమ్మ, అచ్చమ్మ, శారదమ్మ, పార్వతమ్మ, లక్ష్మీదేవి అనే మహిళా కూలీలను ఎక్కించుకున్నాడు. పొలం పనులకు తీసుకెళ్తుండగా రాయచోటి నుంచి పీలేరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఏడుగురు కూలీలు గాయపడ్డారు. ఈ ప్రమాదంపై కారు డ్రైవర్ హైదరాబాద్‌కు చెందిన మహమ్మద్‌అలీ కుమారుడు మహమ్మద్ ముబీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గాయపడిన వారిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

జిల్లా రైఫిల్ షూటింగ్ జట్లు ఎంపిక



జిల్లా రైఫిల్ షూటింగ్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరం బిల్టప్ సమీపంలోని జాకీర్‌హుస్సేన్ రైఫిల్ షూటింగ్ అకాడమీలో బుధవారం ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించే క్రీడాంశాల్లో రైఫిల్‌షూటింగ్ ఒకటన్నారు. క్రీడాకారులు చక్కగా రాణించి జిల్లాఖ్యాతిని చాటి చెప్పాలని సూచించారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవ, నిత్యప్రభాకర్, మహబూబ్‌బాషా, వెంకటలక్ష్మి, ఎల్.ఎ.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రైఫిల్ షూటింగ్ జట్లు..

అండర్-14 బాలికలు : కె.హబీబా సుహాన, వి. జాగృతిరెడ్డి, ఎస్.రేష్మ.

అండర్-14 బాలురు : ఎ. సంజురెడ్డి, నితీష్‌కుమార్.

అండర్-17 బాలికలు : ఎస్.కె. జాగృతి, వి.మౌనిత, బి. ప్రణతి (ఓపన్‌సైట్ విభాగం), శ్రీదేవి, యశస్విని, నవనిధి (పీప్‌సైట్ విభాగం).

అండర్-17 బాలురు : వై.అభినవ్‌కుమార్, వీరేంద్ర, మురళీకృష్ణ.

జూడో ఎంపికలు..

కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి జూడో ఎంపికలు నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి ప్రకటించారు. కార్యక్రమంలో సెలెక్షన్ కమిటీ సభ్యులు అలీ, షహనాజ్, షబానా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్-14 జూడో బాలికలు : ఎం.భారతి, ఎల్.యశస్విని, ఎం.సాత్విక, జి.హిందు, ఎం.అమృత, డి.సుప్రజ.

అండర్-14 జూడో బాలురు : సి.శ్రీహరిచరణ్, పి.కిరణ్, ఎస్.పవన్, ఎస్.విజయ్, ఎం.గోవర్ధన్, జి.ప్రశాంత్, బి.చరణ్‌తేజ.

అండర్-17 బాలికలు : ఎస్.జె.సుల్తాన, జి.ప్రణీత, డి.శ్యామల, ఎస్.జె. గీతిక, పి.అమూల్య, ఎస్.హలీమ, ఎస్.సబీనా, పి.షణ్ముకప్రియ.

అండర్-17 బాలురు : కె.సంతోష్, టి.వి.గణేష్, సి.లోకేష్, ఎం.వి.విష్ణువర్ధన్, టి.ఓబులేసు, పి.వి.రిషికిరణ్, జి.వినయ్, ఎస్.మహమ్మద్‌మున్సూర్, పి. అశోక్, బి.త్రినయ్‌చంద్ర.

వస్తుసామగ్రి తరలింపుపై నిలదీత



వాహనంలోకి ఎక్కించిన పాత రికార్డులు, వస్తువులు

కేవీపల్లె : స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించి పాత రికార్డులు, వస్తు సామగ్రిని గుజిరికి అమ్మేసే ప్రయత్నం చేయడంతో మండల కో-ఆప్షన్ సభ్యుడు సైపుల్లాఖాన్ గుర్తించి అధికారులను నిలదీశారు. వివరాల్లోకి వెళితే.. ఎంపీడీఓ కార్యాలయంలో స్టాకు ఉన్న పాత రికార్డులు, పేపర్లు, పుస్తకాలతో పాటు, కొన్ని పాత వస్తువులను గురువారం సిబ్బంది ఓ వాహనానికి ఎక్కించారు. గమనించిన మండల కోఆప్షన్ సభ్యుడు ఎవరికీ తెలియకుండా ఎందుకు తరలిస్తున్నారని ప్రశ్నించడంతో పొంతన లేని సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సొమ్ము గుట్టు చప్పుడు కాకుండా అమ్ముకునే ప్రయత్నం చేసిన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డిని వివరణ కోరగా, పదిహేనేళ్లగా కార్యాలయంలో ఉన్న పాత రికార్డులు చెదలు పడుతున్నాయని, తమ సిబ్బంది బయట పడేసే ప్రయత్నం చేశారని తెలిపారు. అయితే తిరిగి వాహనం నుంచి దింపి కార్యాలయంలో ఉంచామన్నారు. నిబంధనల మేరకు పాత రికార్డులు నిర్వీర్యం చేస్తామని తెలిపారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరు సమీపంలోని జింకలమిట్ట వద్ద గురువారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో కందుకూరు పంచాయతీ నిలువురాతిపల్లికి చెందిన కృష్ణమూర్తి (45) కర్ణాటక రాష్ట్రం నుంచి 82 మద్యం ప్యాకెట్లను ప్లాస్టిక్ సంచిలో తరలిస్తూ పట్టుబడినట్లు ఏఎస్ఐ గోపాల్ నాయక్ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామన్నారు.

పురుగుల మందు తాగిన మహిళ మృతి

పెద్దమండ్యం : పురుగుల మందు తాగిన మహిళ బుధవారం మృతిచెందినట్లు మృతురాలి కుమారుడు ప్రసాద్‌నాయక్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండలంలోని అవికేనాయక్‌తండా పంచాయతీ షేకేనాయక్‌తండాకు చెందిన బుక్కే శ్రీనివాసులు నాయక్ కుటుంబం కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తోంది. ఈ నేపథ్యంలో భార్య బుక్కే శైలజ (35)ను ఉపాధి కోసం గల్ఫ్‌కు పంపించాడు. మూడేళ్లపాటు అక్కడే ఉన్న ఆమె రూ. 3 లక్షలు తండాకు చెందిన ఓ వ్యక్తికి పంపించినట్లు తెలిసింది. ఇటీవల గల్ఫ్ నుండి తండాకు వచ్చిన శైలజ అతనితో సన్నిహితంగా ఉండేదని సమాచారం. ఈ నేపథ్యంలో ఈనెల 3న పురుగుల మందు తాగినట్లు కుటుంబ సభ్యులు గుర్తించి ఆమెను ఆటోలో తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి 108లో మదనపల్లెకు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి రూయా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. తనతల్లి మృతికి కారణం తండాకు చెందిన వ్యక్తి అని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మహిళలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడి స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదనపల్లె మండలం కోటవారిపల్లెకు చెందిన నరేష్ భార్య ఏ.నందిని(20) కుటుంబ సమస్యలతో పురుగుమందు తాగింది. అదేవిధంగా కురబలకోట మండలం తెట్టు పంచాయతీ దొమ్మన్నబావికి చెందిన సురేంద్ర భార్య వై.హరిత(25) కుటుంబ సమస్యలతో నిద్రమాత్రలు మింగింది. ఆయా ఘటనల్లో కుటుంబ సభ్యులు బాధితులను 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు



ఒంటిమిట్ట(సిద్దవటం) : ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి కల్యాణ వేదిక సమీపంలో ఉన్న కడప-చెన్నై జాతీయ రహదారిపై గురువారం రాత్రి రాజ్‌కుమార్ అనే యువకుడు బైక్‌పై నుంచి అదుపు తప్పి కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... కొత్త మాధవరానికి చెందిన రాజ్‌కుమార్ ఒంటిమిట్టలో వ్యక్తిగత పనులు ముగించుకొని తన స్వగ్రామమైన కొత్త మాధవరానికి బైక్‌లో బయలుదేరాడు. కోదండరామస్వామి కల్యాణ వేదిక వీఐపీ గేటు వద్దకు రాగానే అదుపుతప్పి కిందపడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వ్యక్తిని స్థానికులు వెంటనే 108 వాహనంలో కడపకు తరలించారు.

ఆధిక్యంలో కడప, నెల్లూరు జట్లు


రోహిత్ రోషన్ (98 పరుగులు)


సాయిసూర్యతేజారెడ్డి (69 పరుగులు)


కమిల్ (5 వికెట్లు)


సాబ్జాన్‌బాషా (6 వికెట్లు)


ధనుష్‌రెడ్డి (6 వికెట్లు)


కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. కేఎస్ఆర్ఎం మైదానంలో రెండోరోజు గురువారం 244 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు మరో 2 పరుగులు చేసి 93 ఓవర్లలో 246 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఆదిల్ హుస్సేన్ 63 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సాబ్జాన్‌బాషా 6 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 55.1 ఓవర్లలో 207 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 69 పరుగులు చేశాడు. కడప బౌలర్లు వి. ధనుష్ 6 వికెట్లు, అస్లాం 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్‌వర్మ 34 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్లు సాబ్జాన్‌బాషా 1, ఇస్మాయిల్ 1, సాత్విక్ 1 వికెట్ చొప్పున తీశారు. రెండోరోజు ఆట ముగిసే సమయానికి కడప జట్టు 125 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

ఆధిక్యంలో నెల్లూరు..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 78 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 69.2 ఓవర్లలో 249 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రోహిత్ రోషన్ 98 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు అఖిల్ 4, అజిత్‌బాబు 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 40.3 ఓవర్లలో 151 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నిఖిలేశ్వర్‌రెడ్డి 35 పరుగులు తీశాడు. అనంతపురం బౌలర్ కమిల్ 5 వికెట్లు తీశాడు. రెండోరోజు ఆట ముగిసే సమయానికి నెల్లూరు జట్టు 102 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

రీ సర్వే మరింత వేగవంతం చేయాలి

ఏపీ స్పెషల్ సర్వే అధికారి సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అర్బన్ రీసర్వే కార్యక్రమాన్ని మున్సిపాలిటీ ప్రాంతంలో మరింత వేగవంతం చేయాలని ఏపీ స్పెషల్ సర్వే ఆఫీసర్ సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో అర్బన్ రీసర్వేపై సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జిల్లాకు ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో ఆలోగా రీసర్వే పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాకర్ రావు, రీజినల్ డైరెక్టర్ పీవీఎస్ మూర్తి, డీటీ సీపీఓ కృష్ణసింగ్, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. 10 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం




వాహనం తోపాటు ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్న అటవీ అధికారులు

పీలేరు : వాహనంతోపాటు రూ. 10 లక్షల విలువైన ఎర్రచందనం స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అటవీశాఖ అధికారి వెంకటరమణ తెలిపారు. ఆయన కథనం మేరకు..బుధవారం రాత్రి అందిన సమాచారం మేరకు చిత్తూరు జిల్లా పులిచెర్లలో అటవీ సిబ్బందిచే నిఘా ఏర్పాటు చేశారు. గురువారం తెల్లవారుజామున రొంపిచెర్ల వైపు వచ్చిన ఇన్నోవా వాహనాన్ని ఆపగా డ్రైవర్ ఆపకుండా కొంతదూరం ముందుకెళ్లి వాహనాన్ని రోడ్డు పక్కన ఆపి పరారయ్యాడు. వాహనాన్ని పరిశీలించగా 163 కేజీల బరువు గల ఐదు ఎర్రచందనం దుంగలు గుర్తించినట్లు తెలిపారు. ఈ దాడిలో అటవీ సిబ్బంది ప్రతాప్, వెంకటేష్, చరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి

వైఎస్సార్ జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలింగాచార్యులు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లామత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలింగాచార్యులు

కడప అగ్రికల్చర్ : మత్స్యకారుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని మెరుగైన జీవనాన్ని పొందాలని జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలింగాచార్యులు తెలిపారు. గురువారం కడపలో జిల్లా మత్స్యశాఖ కార్యాలయ ఆవరణంలో జిల్లా మత్స్య సహకార సంఘాల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశీయ నీటి వనరులైన నదులు, రిజర్వాయర్లు, చెరువుల్లో వేట చేసేందుకు మత్స్యకారులకు 75 శాతం రాయితీలో బోట్లు, వలలు పొందవచ్చన్నారు. ఈ పథక యూనిట్ ఖరీదు రూ. 50 వేలు కాగా ఇందులో లబ్ధిదారుని వాటా రూ. 12500 మిగతా రూ. 37500 రాయితీగా వస్తుందన్నారు. వీటితోపాటు చేపల రవాణాకు ఉపయోగించే నాలుగు చక్రాల వాహనాలు, మూడు చక్రాల చేపల అమ్మకపు ఆటోలు, ఐస్‌బాక్సుల తోపాటు మోపెడ్‌లు రాయితీతో పొందవచ్చన్నారు. మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, మత్స్యశాఖ అధికారి కిరణ్‌కుమార్, గ్రామ మత్స్య సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణ పరిధిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని ముద్దనూరు రహదారిలో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న లక్షుమయ్య అనే వ్యక్తిని వేగంగా వెళుతున్న ఇన్నోవా వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్షుమయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనను చూసిన స్థానికులు బైక్‌లలో వాహనాన్ని వెంబడించారు. దీంతో వాహన డ్రైవర్ అతి వేగంగా పెద్ద పసుపల రహదారి గుండా వెళ్లిపోయాడు. తరువాత బైపాస్ రోడ్డు నుంచి మునిసిపల్ కార్యాలయం మీదుగా అతి వేగంగా ప్రొద్దుటూరు వైపు మళ్లించాడు. దాదాపు 4 కిలోమీటర్లు వెళ్లిన తరువాత జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు స్కూటీలో వెళుతున్న యర్రగుంట్ల మండలం ఇల్లూరుకు చెందిన ఎంఎస్ అశోక్ కుమార్‌రెడ్డి (22) అనే యువకుడిని వెనుక వైపు నుంచి ఢీ కొన్నాడు. దీంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. అశోక్‌కుమార్‌రెడ్డి జమ్మలమడుగు పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. తిరిగి వంద అడుగులు వెళ్లిన తరువాత గుర్తు తెలియని వ్యక్తిని(45) అదే వాహనం ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనదారుడు ప్రొద్దుటూరు వైపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.